# కేసీఆర్‌ది జనరంజక పాలన

- ప్రతిపక్షాల మాటలకు మోసపోవద్దు
- అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



యువకులకు కండువాలు కప్పుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**మోర్తాడ్‌/భీమ్‌గల్‌ :** సీఎంగా కేసీఆర్‌ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరానికి ఏటా రూ.16వేలు చెల్లిస్తామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు చెబుతునన కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దని సూచించారు. మోర్తాడ్‌ మండలం దోన్‌పాల్‌, గాండ్లపేట్‌, సుంకెట్‌, భీమ్‌గల్‌ మండలం రూప్లాతండా, ఎంజీ తండా, బడా భీమ్‌గల్‌లో ప్రశాంత్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెట్టుబడి సాయాన్ని క్రమక్రమంగా పెంచేందుకు సీఎం చర్యలు తీసుకుంటారన్నారు. ఆసరా పింఛన్లను కూడా ఏటేటా పెంచుతూ రూ. 5వేలకు దాకా పెంచేందుకు కేసీఆర్‌ హామీ ఇచ్చారన్నారు. రేషన్‌ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమాను రైతు బీమా మాదిరిగా అమలు చేయనున్నామన్నారు. ఆరోగ్య బీమా రూ.15 లక్షలకు పెంచి ప్రజలకు మేలు చేయనున్నారన్నారు. గ్యాస్‌ సిలిండర్‌ను రూ. 400లకే అందించడానికి సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం కేసీఆర్‌ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి పథకానికి గిరిజనులతోనే నాంది పడిందన్నారు. కార్యక్రమంలో మోర్తాడ్‌ జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, సర్పంచులు కడారి శ్రీనివాస్‌, మామిడి సవిత, పర్స దేవన్న తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

**వేల్పూర్‌/కమ్మర్‌పల్లి/భీమ్‌గల్‌:** సీఎం కేసీఆర్‌ది జనరంజక పాలన అని, బాల్కొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌, భీమ్‌గల్‌ మండలాల నుంచి 150 మంది శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కమ్మర్‌పల్లి రజకసంఘం, మోర్తాడ్‌ వ్యాయామశాల యూత్‌ సభ్యులు, పల్లికొండ హవా యూత్‌సభ్యులు, లింగాపూర్‌ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు, భీమ్‌గల్‌ పట్టణానికి చెందిన కాంగ్రెస్‌ మైనారిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ జుబేర్‌, సల్మాన్‌, అజయ్‌గౌడ్‌ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కమ్మర్‌పల్లి మండల బీఆర్‌ఎస్‌ రేగుంట దేవేందర్‌, నాయకులు కొత్తపల్లి అశోక్‌, రుగ్వేద్‌ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌ పట్టణానికి చెందినవారితోపాటు పల్లికొండ, లింగాపూర్‌ గ్రామాలకు చెందిన పలువురు యువకులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉన్నాం



గొట్టిముక్కలలో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

**మాక్లూర్‌:** అభివృద్ధిపై బీజేపీ చిత్తశుద్ధితో ఉందని ఆర్మూర్‌ నియోజకవర్గ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొంకన్‌పల్లి, గొట్టిముక్కల గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు కుట్రలు, కుతంత్రాలు తెలియని, ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ, అవినీతి, అక్రమాలకు తావులేకుండా సేవచేస్తానని రాకేశ్‌రెడ్డి అన్నారు. ఇంటింటికీ వెళ్లి ఒక్కసారి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఆయా గ్రామాల్లో రాకేశ్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్‌, గంగోనే సంతోష, మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, కుంచోత్‌ లత పీర్‌సింగ్‌, ఎం రవి, గంగాధర్‌, నర్సింగ్‌రావు, గంగారెడ్డి పాల్గొన్నారు.

**ఆర్మూర్‌ మండలంలో..**

**పెర్కిట్‌(ఆర్మూర్‌):** ఆర్మూర్‌ మండలం ఫత్తేపూర్‌, సూర్బిర్యాల్‌, కొమన్‌పల్లి గ్రామాల్లో రాకేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే ప్రగతిసాధ్యం



వద్యాట్‌లో మహిళలతో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ



**మోర్తాడ్‌:** బీజేపీతోనే ప్రగతి సాధ్యమని, గెలిచిన వెంటనే అర్హులకు కొత్త రేషన్‌కార్డులు, ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అమలు చేస్తామని బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని వద్యాట్‌, దోన్‌పాలలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ తొమ్మిదేళ్ల అధికారంలో ఉండి కొత్త రేషన్‌ కార్డులను జారీ చేయలేదన్నారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లను నమ్మితే వారు చేసిందేమీ లేదని విమర్శించారు. గంజాయిని నిర్మూలించి గ్రామాల్లో శాంతి స్థాపనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## సుదర్శన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు

**బోధన్‌:** బోధన్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి తరఫున ఆయన మద్దతుదారులు, పార్టీ ముఖ్య నాయకులు శనివారం వేర్వేరుగా రెండు సెట్ల నామినేషన్‌పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి రాజాగౌడ్‌కు అందజేశారు. మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ మహ్మద్‌ గౌసొద్దీన్‌, కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, దాము, యువజన కాంగ్రెస్‌ పట్టణ నాయకుడు తలారి నవీన్‌, టీపీసీసీ డెలిగేట్‌ గంగాశంకర్‌, ఏఎంసీ మాజీ చైర్మన్‌ పాషామోహినొద్దీన్‌, నాయకులు గణపతిరెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**ఆర్మూర్‌లో ఇండిపెండెంట్‌..**

**ఆర్మూర్‌టౌన్‌:** ఆర్మూర్‌లో ఇండిపెండెంట్‌ అభ్యర్థి ప్రణయ్‌గౌడ్‌ నామినేషన్‌ దాఖలు చేశారు. రిటర్నింగ్‌ అధికారి వినోద్‌కుమార్‌కు నామినేషన్‌ పత్రాన్ని అందజేశారు. ప్రణయ్‌గౌడ్‌ స్వస్థలం డొంకేశ్వర్‌.

## బీఆర్‌ఎస్‌, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

**మోర్తాడ్‌:** దళితులను దగా చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మోర్తాడ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. దళితుడిని సీఎం చేస్తామని హామీ ఇచ్చి కేసీఆర్‌ మోసం చేశారన్నారు. దళితబంధును కేవలం ఎన్నికల కోసం అమలు చేసి ఎంతో మంది దళితులను వంచించారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ నిధులను వినియోగించే విషయంలోను దళితవాడలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నాయకులు సుంకరి విజయ్‌, పాలెపు నర్సయ్య, సావెల్‌ గంగాధర్‌, మామిడి రాజేశ్వర్‌, అరికెల సాయిలు, ఇత్వార్‌పేట్‌ లింగన్న, మాదరి రాజేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తా ఎమ్మెల్యే అభ్యర్థే..



మాట్లాడుతున్న వడ్డి మోహన్‌రెడ్డి

**బోధన్‌టౌన్‌(బోధన్‌):** బోధన్‌ నియోజక వర్గంలో పనిచేసే ప్రతి బీజేపీ కార్యకర్త ఎమ్మెల్యే అభ్యర్థేనని, ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రవిగార్డెన్‌లో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని సూచించారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చారని, ఈ సారి ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీధర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, నాయకుడు మేక విజయ్‌, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవ చేసే అవకాశమివ్వండి



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్‌

**భీమ్‌గల్‌/వేల్పూర్‌ :** ఎమ్మెల్యేగా తనను గెలిపించి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశమివ్వాలని కాంగ్రెస్‌ అభ్యర్థి ముత్యాల సునీల్‌ కోరారు. భీమ్‌గల్‌ మండలం కుప్కల్‌, జాగిర్యాల్‌, వేల్పూర్‌ మండలం రామన్నపేట్‌ గ్రామాల్లో ముత్యాల సునీల్‌ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు ఒకే కాంట్రాక్టర్‌ను పెట్టుకొని నియోజకవర్గ ప్రజలను దోపిడీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే రాజీవ్‌ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ, పంట పెట్టుబడి సహాయం రూ.15 వేలు, భూమి లేని రైతుకూలీలకు ఏడాదికి రూ.12 అందిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2500 జమ చేస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. రూ.500 గ్యాస్‌ సిలిండర్‌ అందిస్తామనన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

**వర్ని: (మోస్రా):** మండలంలోని గోవూర్‌ హైస్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రవీంద్రబాబు, జరీనా, ప్రసన్నలక్ష్మీని పాఠశాల విద్యాకమిటీ, ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. పాఠశాల కమిటీ చైర్మన్‌ సన్నేసాబ్‌, సర్పంచ్‌ నరేందర్‌రెడ్డి, హెచ్‌ఎం నాగనాథ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ సుధాకర్‌ రెడ్డి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్‌, వాసవి, రాజకళ, శుభాంగి, విజయలక్ష్మి, వరప్రసాద్‌ పాల్గొన్నారు.

## పార్టీల్లో చేరికలు..

**బోధన్‌/బోధన్‌ టౌన్‌:** బోధన్‌లోని రజక సంఘం సభ్యులు, బీఆర్‌ఎస్‌ నాయకులు సుమారు 20 మంది తూము శరత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్‌, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ మహ్మద్‌ గౌసొద్దీన్‌, నాయకులు గంగాశంకర్‌, దాము పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లిలో..**

**కమ్మర్‌పల్లి/మోర్తాడ్‌/భీమ్‌గల్‌:** మండలంలోని ఉప్లూర్‌కు చెందిన శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం సభ్యులు టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ అభ్యర్థి సునీల్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తిప్పిరెడ్డి శ్రీనివాస్‌, తక్కూరి దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్‌ మండల బీఆర్‌ఎస్‌ యువనాయకుడు తేజతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చైతన్య, రహత్‌నగర్‌ గ్రామ బీజేపీ అధ్యక్షుడు రాజేందర్‌, బీజేపీ ఎస్టీ సెల్‌ మండల ఉపాధ్యక్షుడు లింబాద్రితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

**బీజేపీలో చేరికలు..**

**మాక్లూర్‌:** మండలంలోని గుత్పతండా సర్పంచ్‌ జ్యోతిమోహన్‌తోపాటు రాంచంద్రపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది శనివారం బీజేపీలో చేరారు. గిరిజనులను బీఆర్‌ఎస్‌ మోసం చేసి, నిరుద్యోగులను పట్టించుకోలేనందువల్లే బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరినట్టు సర్పంచ్‌ జ్యోతిమోహన్‌ పేర్కొన్నారు. కార్యక్రమంలో మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, కల్లెడి సర్పంచ్‌ లావణ్య ప్రసాద్‌గౌడ్‌, మాజీ జెడ్పీటీసీ కుంచోత్‌లత పీర్‌సింగ్‌, పార్టీ అధ్యక్షుడు సురేష్‌నాయక్‌, రవినాయక్‌, రాములునాయక్‌ పాల్గొన్నారు.

## యెండల లక్ష్మీనారాయణకు ఘనస్వాగతం

**వర్ని/రుద్రూర్‌:** బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత నియోజకవర్గానికి వెళ్తున్న యెండల లక్ష్మీనారాయణకు బీజేపీ శ్రేణులు పలుచోట్ల ఘనస్వాగతం పలికాయి. మోస్రాలోని శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ చందూర్‌, వర్ని, రుద్రూర్‌, కోటగిరి, పొతంగల్‌, బీర్కూర్‌ మీదుగా బాన్సువాడ వరకు కొనసాగింది. బాన్సువాడ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ భాస్కర్‌, కో కన్వీనర్‌ భూపాల్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్‌గౌడ్‌, బీజేవైఎం నాయకులు, వర్ని మండల అధ్యక్షుడు శంకర్‌, మో స్రా మండల పార్టీ అధ్యక్షుడు స్వామిగౌడ్‌, కార్యదర్శి సాయిలు, మోస్రా ఉప సర్పంచ్‌ సుదర్శన్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

## జీవాలకు పీపీఆర్‌ టీకాలు



**బాల్కొండ:** ముప్కాల్‌ మండలం నాగంపేట్‌ గ్రామంలో గొర్రెలకు శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా సరఫర చేసిన పీపీఆర్‌ టీకాలను పశు వైద్యాధికారి గౌతం రాజు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. గొర్రెల యజమానాలు పశు వైద్యా సిబ్బందితో సహకరించాలన్నారు. గొర్రెలకు తప్పకుండ టీకాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో పశు మిత్ర లక్ష్మి, గోపాల మిత్ర ప్రణీత్‌, మల్లయ్య, షకిల్‌ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాల కవాతు



**బాల్కొండ/కమ్మర్‌పల్లి/ఆర్మూర్‌టౌన్‌:** బాల్కొండ, కమ్మర్‌పల్లి మండల కేంద్రాలతోపాటు ఉప్లూర్‌ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. మంచి భవిష్యత్‌కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఈసీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి, బాల్కొండ, ముప్కాల్‌, కమ్మర్‌పల్లి ఎస్సైలు గోపి, భాస్కరాచారి, రాజశేఖర్‌, అసిస్టెంట్‌ కమాండెంట్‌ జితేందర్‌, ఇన్‌స్పెక్టర్‌ రాబిన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్మూర్‌ పట్టణంలో నిర్వహించిన కవాతులో ఏసీపీ జగదీశ్‌, ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌ శ్రేణుల విస్తృత ప్రచారం



సాలూర మండలం కుమ్మన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్‌ నాయకులు

**బోధన్‌/రెంజల్‌:** తొమ్మిదేళ్లలో కేసీఆర్‌ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్‌ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలవుతాయని బోధన్‌ ఏఎంసీ చైర్మన్‌ వీఆర్‌ దేశాయ్‌, ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్‌ అన్నారు. బోధన్‌ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ శ్రేణులు షకీల్‌కు మద్దతుగా శనివారం విస్తృతం ప్రచారం నిర్వహించాయి. సాలూర, కుమ్మన్‌పల్లి, ఖాజాపూర్‌, హున్సా, రెంజల్‌ మండలం తాడ్‌బిలోలిలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ ఎండీ షకీల్‌, పార్టీ మండల అధ్యక్షుడు గోగినేని నర్సయ్య, నాయకులు బుద్దె రాజేశ్వర్‌, రైతు సమన్వయ సమితీ జిల్లా డైరెక్టర్‌ మౌలానా, నాయకులు లింగాల అబ్బన్న, లింగారెడ్డి, సుధాకర్‌రావ్‌, మల్ల సాయిలు, అన్వర్‌, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రుద్రూర్‌లో..**

**రుద్రూర్‌:** మండలంలోని చిక్కడపల్లిలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు మోహన్‌, కార్యదర్శి నక్క గంగాధర్‌, ఉపసర్పంచ్‌ చింతల నరేందర్‌, బూత్‌ కన్వీనర్‌ కరోల్ల రాజయ్య, రైతు బంధు కన్వీనర్‌ హనుమంతు, బీఆర్‌ఎస్‌ యూత్‌ ఉపాధ్యక్షుడు రాజు, ఎస్సీ సెల్‌ ఉపాధ్యక్షుడు గోపి, మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు లాల్‌ మొహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

**బాల్కొండలో..**

**బాల్కొండ:** బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా మండలాల్లోని బీఆర్‌ఎస్‌ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ప్రభుత్వం గడిచిన తొమ్మిదేళ్లలో ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను వివరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న చంద్రపుల్లారెడ్డి వర్ధంతి సభ



**ఆర్మూర్‌టౌన్‌:** ఈనెల 9న ఆర్మూర్‌లో నిర్వహించనున్న కామ్రేడ్‌ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను విజయంతం చేయాలని సీపీఐఎంఎల్‌ రామచంద్రన్‌ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్‌ అన్నారు. పట్టణంలో శనివారం సీపీఐఎంఎల్‌ రామచంద్రన్‌పార్టీ నాయకులు సమావేశమయ్యారు. భూమి, భుక్తి, విముక్తి కోసం, సమసమాజ స్థాపన కోసం పుల్లారెడ్డి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సమావేశంలో ఆర్మూర్‌ డివిజన్‌ కార్యదర్శి బొట్ల రాజు, నాయకులు తూర్పాటి శ్రీనివాస్‌, సృజన్‌, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు హామీలను అమలు చేస్తాం



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

**పెర్కిట్‌(ఆర్మూర్‌):** కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ఆరు హామీలను అమలు చేస్తామని ఆర్మూర్‌ నియోజకవర్గ అభ్యర్థి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌ మండలం మంథని, పిప్రి, అమ్దాపూర్‌, మగ్గిడి, ఖానాపూర్‌ గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్‌ కార్యాలయాన్ని సీనియర్‌ నాయకుడు మార చంద్రమోహన్‌ ప్రారంభించారు. నాయకులు కోల వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

### సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్‌



**పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌(ఆర్మూర్‌)**

స్క్రీన్‌-1 – ఘోస్ట్‌- 10.15,
టైగర్‌ నాగేశ్వరరావు - 01.10
నరకాసుర (తెలుగు) - 04.35
ఘోస్ట్‌- 7.35
భగవంత్‌ కేసరి (తెలుగు) - 10.30

స్క్రీన్‌-2 – మా ఊరి పొలిమేర-2 (తెలుగు) - 10.25, 1.15, 7.30, 10.20
లియో (తెలుగు) - 4.05

స్క్రీన్‌-3 – కీడాకోలా - 11.20, 2.00,4.40,7.20, 10.00

స్క్రీన్‌-4 – భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35
విధి(తెలుగు)-4.10, శంకర్‌దాదా ఎంబీబీఎస్‌ - 10.00

## ఇండిపెండెంట్‌గా నామినేషన్‌ వేస్తా

**బోధన్‌టౌన్‌(బోధన్‌):** ఈ నెల 9వ తేదీన బోధన్‌ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ వేస్తానని బీఆర్‌ఎస్‌ నాయకుడు అమర్‌నాథ్‌బాబు అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆలోచనలే తన మేనిఫెస్టోగా తయారు చేసుకొని ప్రజలకు వద్దకు వెళ్తానని అన్నారు. వారి ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్‌ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, నాయకులు వీరస్వామి, సాయిలు, లింగం, నజీర్‌ పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**బోధన్‌టౌన్‌(బోధన్‌):** పట్టణంలోని తట్టికోట్‌ కాలనీలో ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గులు, భజన పాటలు, మ్యూజికల్‌ చైర్‌, కోలాటం తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి అబ్బయ్య, భక్తులు పాల్గొన్నారు.


## హెచ్‌ఎంపై సస్పెన్షన్‌ వేటు

**బోధన్‌రూరల్‌(బోధన్‌) :** బోధన్‌ మండలం పెంటాకుర్దు క్యాంపు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యయురాలు రత్నకుమారి సస్పెండ్‌ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యూనిఫామ్స్‌ కోసం విద్యార్థుల నుంచి రత్నకుమారి డబ్బులు వసూలు చేసినట్లు విద్యార్థి సంఘం నాయకులు డీఈవో, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారుల నివేదిక ఆధారంగా రత్నకుమారిని సస్పెండ్‌ చేసినట్లు తెలిసింది. ఇన్‌చార్జి ఎంఈవో నాగనాథ్‌ను వివరణ కోరగా.. హెచ్‌ఎం రత్నకుమారి సస్పెండ్‌ అయినమాట వాస్తవమేనని అన్నారు.

## భారత జాగృతిలో చేరిక

**బోధన్‌టౌన్‌(బోధన్‌):** బోధన్‌ పట్టణానికి చెందిన బీజేవైఎం నాయకులు శనివారం భారత జాగృతిలో చేరారు. భారతజాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి రావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. భారత జాగృతిలో చేరినవారిలో బీజేవైఎం నాయకులు వెంకటేశ్‌, రాజేశ్‌, శివ, సాయితోపాటు యువకులు ఉన్నారు. కార్యక్రమంలో భారత జాగృతి నియోజకవర్గ కన్వీనర్‌ గట్టు హరికృష్ణ, నాయకులు సుకుమార్‌రావు, రంజిత్‌, సాయిలు ఉన్నారు.

## కర పత్రాల ఆవిష్కరణ



**బాల్కొండ:** ఈ నెల 5న హైదరబాద్‌లో నిర్వహించనున్న విశ్వకర్మల మహాజన సభను విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కోరారు. శనివారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

## చిరుత సంచారంపై విచారణ

**నవీపేట :** మండల కేంద్రం శివారులోని లింగమయ్య గుట్ట శివాలయం సమీపంలో చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. గుట్ట ప్రాంతంలోని శివాలయం పరిసరాల్లోని పొదల్లో చిరుత కనిపించిందని ఆలయ పూజారి అఖిల్‌ శుక్రవారం అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌ రేంజ్‌ ఇన్‌చార్జి బీట్‌ ఆఫీసర్‌ ప్రవీణ్‌, సెక్షన్‌ ఆఫీసర్‌ జెహురు చిరు త ఆనవాళ్లను సేకరించేందుకు చర్యలు చేపట్టారు. భయందోళన చెందొద్దని, చిరుత ఆనవాళ్లు నిర్ధారణ కాలేదని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### చట్టాలపై అవగాహన ఉండాలి



**బోధన్‌:** శాంతిభద్రతల రక్షణకు క్షేత్ర స్థాయిలో విధుల నిర్వర్తించే పోలీసుశాఖ అధికారులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్‌ కోర్టు అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ చిదిరాల రాణి అన్నారు. రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ వైజయంతి, లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని కోర్టులో డివిజన్‌ పరిధిలోని పోలీస్‌ శాఖ అధికారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రిప్రజెంటేషన్‌ ఆఫ్‌ పబ్లిక్‌ యాక్టు 1951, ఇండియన్‌ పినల్‌ కోడ్‌లోని 1860 సెక్షన్స్‌లో ఉన్న ఎన్నికలకు సంబంధించి నేరాలు, వివిధ సెక్షన్లను వివరించినట్లు ఏపీపీ తెలిపారు.

### ప్రైవేట్‌ యాజమాన్యం పట్టించుకోవడం లేదు



**బోధన్‌:** తమను ఫ్యాక్టరీ యాజమాన్యం, పాలకులు పట్టించుకోవడం లేదని ఎన్డీఎస్‌ఎల్‌ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించి ఆదుకోవాలి, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనే డిమాండ్లతో కార్మికులు ఎన్డీఎస్‌ఎల్‌ ఫ్యాక్టరీ గేటు ఎదుట చే పట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం నాటికి 92వ రోజుకు చేరాయి. కార్మిక నాయకులు నాగేశ్వర్‌రావు, అన్వర్‌మియా దీక్షలో కూర్చున్నారు.

### విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన



**ఆర్మూర్‌టౌన్‌:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అగస్త్య ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్‌ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హెచ్‌ఎం లక్ష్మీన్సయ్య, ఫౌండేషన్‌ సభ్యులు శ్రీనివాస్‌, సుమలత, రవీందర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

### నిజాయితీగా ఉండాలి



**ఆర్మూర్‌టౌన్‌:** సమాజంలోని ప్రతిఒక్కరూ నిజాయితీగా ఉండి అవినీతిని అంతం చేయాలని క్షత్రీయ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్‌ దేవేందర్‌ అన్నారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని క్షత్రీయ స్కూల్‌ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### లిల్లిపుట్‌లో హాలోవిన్‌ డే



**పెర్కిట్‌(ఆర్మూర్‌):** ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్‌ పాఠశాలలో శనివారం హాలోవిన్‌ డే నిర్వహించారు. చిన్నారులు దెయ్యాల వేషధారణలో అలరించారు. చీకటిలో దెయ్యాలుంటాయనే భ్రమను చిన్నారుల్లో నుంచి తొలగించాడానికి హాలోవిన్‌ డే నిర్వహించినట్లు కరస్పాండెంట్‌ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆ పార్టీలను ఓడించండి

**వర్ని:** పోరాటాలు, తాగ్యాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్‌ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలను ఓడించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేశ్‌ పిలుపునిచ్చారు. చందూర్‌ మండల కేంద్రంలోని బీడీ కంపెనీలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కొత్త హామీలను గుప్పిస్తున్నారని విమర్శించారు. బీడీ కార్మికుల ఉపాధిని దెబ్బ తీసే కోప్టా చట్టాన్ని తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవ్‌, రాజమణి, భారతి, విజయ, అభిజ్ఞ, జ్యోతి, రేఖ, అనిత తదితరులు పాల్గొన్నారు.

### 8న సర్వసభ్య సమావేశం

**రుద్రూర్‌:** మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్‌ తెలిపారు. ఎంపీపీ సుజాత నాగేందర్‌ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.